# తెలిస్తే?

-శ్రీకృష్ణవరప్రసాద్

వామనరావ్‌ని 'మనరావే' అన్నట్టు చూసేవాళ్ళూ, మాట్లాడేవాళ్ళూ ఎక్కువే. ఎంతమంది అనే లెక్కల్లోకి వెళ్తే ఈకథ తీరే మారిపోతుంది. కనుక వద్దు. అతనికి అంత ఆప్యాయతాదరాలు ఎందుకు అనే ప్రశ్నకి జవాబు అతను చేసే ఉద్యోగంలో దొరుకుతుంది.

అదొట్టి ఉద్యోగం కాదు. ప్రభుత్వోద్యోగం. హోదా మాటెలా ఉన్నా సీటు మహా కీలకమైంది. ఆ కారణంగా అతను పల్లకీ ఎక్కుతాననాలే కానీ మోస్తామంటూ బోయీలాగా మారేందుకు ముందుకొచ్చేవాళ్ళూ బోలెడుమంది.

అతను సొంతకారు వదిలేసి మరో వాహనంలో వెళ్లదలుచుకుంటే ఫ్యాక్షన్ సినిమాల్లో ఎన్ని టాటా సుమోలతో హడావుడి చేస్తారో ఆ సంఖ్యకు తక్కువకాకుండా-

"నా కారులో డ్రాప్‌చెయ్యనివ్వండి మిమ్మల్ని" అంటే

"మీరు కాలు కింద పెట్టకుండా నా కారుంది, రండి" అంటూ పోటీపడతారు కారున్న షావుకార్లు.

అన్నట్టు వామనరావ్ ప్రదర్శించే చమత్కారాల్లో ఒకటి "నాది మధ్యతరగతి కారు" అంటూ తన మారుతిని చూపడం. ఉద్యోగం ద్వారా సంపాదించి వెనకేసిన ధనకనక వస్తు వాహనాలు ఇతరుల కళ్ళబడడం అతనికి బొత్తిగా గిట్టదు.

వామనరావ్ కలలోనైనా మర్చిపోని విషయం నీ,నా ప్రయోజనాల్ని చూసుకోవడం.

అంటే ఎల్లప్పుడూ దీనికి నాకేమొస్తుందని, నాకేమైనా మిగులుతుందా? అనే ప్రశ్నలో వేసుకుని లబ్ధి చూసుకునే ఎదుటివాళ్ళ పనుల్ని తేలుస్తాడు? లేకపోతే నానుస్తాడు.

మొన్నటికి మొన్న

'వద్దు. తొందరపడకు' హెచ్చరించింది వామనరావ్ మెదడు.

అలాంటి విషయాల్లో అతని మెదడెప్పుడూ అలర్ట్‌గానే ఉంటుంది. అతనిచ్చిన ట్రెయినింగ్ మామూలుది కాదు మరి.

అసలు హృదయంపై మెదడుపైచేయి సాధించేటట్టు చేయడం ఒక ఎత్తైతే, మళీళ తనను హృదయం ఓడించకుండా చూసుకోవడానికి అతను మెదడుతో కావాల్సిన కసరత్తులు ఎప్పుడూ చేయించడం మరో ఎత్తు.

ఇంతకీ అతని మెదడు హెచ్చరించింది, అతన్ని ఓ ఫోన్‌కాల్ చేయకుండా ఆపడానికే.

ఆ హెచ్చరిక పర్యవసానంగా వామనరావ్ 'నాకెందుకు దండగ! అతని మొబైల్ నెంబర్‌కి డయల్ చేసి ఊరుకుంటే నా నెంబర్ చూసుకుని అతనే ఫోన్ చేస్తాడు కదా! అప్పుడు విషయం చెప్పవచ్చు' అనే నిర్ణయానికొచ్చాడు.

డయల్ చేసి అవతల ఫోన్ రింగవ్వడం విన్పించగానే చటుక్కున ఫోన్ పెట్టేశాడు వామనరావ్.

రెండు నిముషాలు...ఐదు నిముషాలు...పది నిముషాలైనా అతనినుంచి ఫోన్ రాలేదు. ఈలోపు ఎదురుచూడడంతో ఉన్న ఇబ్బంది అతన్ని ఎంత అవస్థ పెట్టాలో అంతా పెట్టింది.

మరోసారి ట్రై చేసి చూద్దామని ఫోన్ చేస్తే అట్నుంచి అతను వెంటనే మాట్లాడాడు.

"సారీ ఇప్పుడే చూసుకున్నాను నీ మిస్డ్‌కాల్! ఇంతకుముందు స్నానానికెళ్లాను.." అని అతను వివరించబోతుంటే మధ్యలోనే తుంచేశాడు వామనరావ్.

"నీ పని పూర్తయిందోయ్!" అంటూ టూకీగా అఫీషియల్ విషయం చెప్పాడు తద్వారా మర్నాడు తనకు అందే మొత్తాన్ని తలచుకుని ఖుషీ అవుతూ.

"రేపు కలుస్తున్నావుగా గుడ్‌నైట్!" అంటూ వామనరావ్ ఫోన్ పెట్టెయ్యబోతుంటే "ఇంకేమిటీ కబుర్లు?" అనడిగాడతను.

"ఏమీ లేవు" అన్నాడు ఇతగాడు.

"ఏమైనా చెప్పవోయ్. ఇంట్లో అందరూ బైటకెళ్లారు ఏమీ తోచడం లేదు" అన్నాడతను.

"ఏమైనా అంటున్నావంటే నువ్వు చెవులొగ్గి వినవని అర్థం. నీవు విన్నా, వినకపోయినా పట్టించుకోకుండా వాగడానికి నేనేమీ సన్మానసభలకి గెంతుకుంటూ వెళ్ళే వక్తను కానే!" జోక్ చేస్తున్నట్టు అని ఫోన్ పెట్టేశాడు వామనరావ్.

తర్వాత 'నీకు ఇన్‌కమింగ్ కాల్ అనేగా, ఇంకా ఇంకా మాట్లాడమని ప్రోత్సహిస్తున్నావ్. నేనంత తెలివితక్కువవాడినా. కాల్స్ వేస్ట్ చేసుకోవడానికి? ఈసారి నువ్వు ఫోన్ చేస్తావు చూడు, అప్పుడు చెబుతాన్లే నీకు ఈ ప్రపంచంలోని కబుర్లన్నీ మేళవించి బాగా విందువుగాని' అనుకున్నాడు మనసులో.

నిన్నటికి నిన్న-

జడలో మల్లెచెండు తురుముకుని చిరునవ్వుతో దగ్గరికొచ్చిన భార్యను సరసంగా కాకుండా ఈ దండగ ఒహటా? అన్నట్టు విరసంగా చూశాడు వామనరావ్.

ఫేస్ రీడింగ్‌లో అనుభవజ్ఞురాలు కాని ఆమె "సినిమాకెళ్దామండీ" అంటూ మామూలుగా సోఫాలో అతని పక్కన కూర్చుంది.

"టీవీలో పొద్దస్తమానం చూసేవి చాలడం లేదా?" అని గసరబోతూ మల్లెల గుబాళింపు ప్రభావంతో కాస్త మనసు తిరిగి

"ఏ సినిమాకేంటి?" అనడిగాడు.

"ఏదో ఒకటండీ. మీ ఇష్టం?'

"నా ఇష్టానికేం గానీ నీకు ఫలానా సినిమాయే చూడాలని లేనప్పుడు వెళ్లడం వేస్ట్ కాదూ!మానేద్దాం" అన్నాడు.

ఆమె ఊరుకోక "టికెట్ రేట్లు తగ్గించారు కదండీ" అంది.

"అయితే?...ఇన్నాళ్ళూ డిస్కౌంట్‌సేల్స్‌కి బయలుదేరినట్లు ఇప్పుడిహ సినిమాలకి ఎగబడతావా? టీవీలో ఎన్నెన్ని వస్తున్నాయ్. అవి పనికిరావడం లేదా నీకు?" అని గొంతును పెంచి ఆమె నోరు నొక్కేశాడు.

ఇంతకుముందు టీవీలో ఏడుపుగొట్టు సీరియల్స్ అన్నీ ఫాలో అయిపోతూ తన అవసరాల్ని నిర్లక్ష్యం చేస్తోందని వామనరావ్ భార్యపై విరుచుకుపడిన రోజులున్నాయి.

తర్వాత సరే ఈ పిచ్చిలోనే కదలకుండా పడుండనీ అనుకుని వదిలేశాడనే సంగతి ఆమెకు తెలీదు పాపం.

ఇక ఇవాళేమో-

ఆఫీస్ నుంచి తిరిగొస్తుండగా వామనరావ్‌కి సిగరెట్ తాగాలనే కోరిక పుట్టింది. అతనికి జేబులో సిగరెట్ రెడీగా లేనప్పుడు అలా అన్పించడం అరుదాతి అరుదు.

ఇంతవరకూ వేలకొద్దీ సిగరెట్లు కాల్చి పారేశాడు గానీ అతను వాటిని కొన్నది ఎన్నిసార్లంటే

వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. తోటివాళ్ళు స్మోక్ చేస్తున్నప్పుడు ఫార్మాలిటీ కోసం వామనరావ్‌కి ఆఫర్ చేయడమో లేదా అతనే చొరవగా అడిగి తీసుకోవడమో అలా నెట్టుకొచ్చేస్తున్నాడు మరి.

సాధారణంగా అతను సిగరెట్ అడిగినప్పుడు అతని సర్కిల్‌లో వాళ్ళు ఓ సిగరెట్ తీసివ్వరు. ఎచ్చుగా పెట్టె తీసి అతని చేతిలో పెడతారు. అతను కనీసం రెండు సిగరెట్లు తీసుకునిగానీ పెట్టె తిరిగి ఇవ్వడు. అలా ఒక్కడే వున్నప్పుడు కూడా తేరగా వచ్చిన సిగరెట్లనే కాల్చే వీలు కల్పించుకున్న తెగువరి వామనరావ్.

అతని ధాటికి భయపడి నేను తాగేవే కాకుండా అతను తగలేసే సిగరెట్లకీ నా డబ్బే తయలేయడం ఎందుకు అనుకుని స్మోకింగ్ అలవాటు మానుకున్నవాళ్ళు ఇద్దరు ముగ్గురున్నారు. ఆమేరకు వామనరావ్ తనకు తెలియకుండానే లోకోపకారం చేశాడనుకోవచ్చు.

అలాంటి వామనరావ్ కొనక కొనక తను కొనే సిగరెట్ కోసం ఓ పాన్‌షాప్ దగ్గర కారు ఆపాడు.

కారు దిగి వెళ్లి "ఓ సిగరెట్ ఇవ్వు?" అన్నాడు షాపులో ఉన్న కుర్రాడితో.

"ఏ సిగరెట్ సార్?" అనడిగాడతను.

"నాకేమీ బ్రాండ్ల పట్టింపులేదోయ్" చెప్పాడు వామనరావ్ పదిరూపాయల నోటు ఇస్తూ.

అతను సిగరెట్ అందించి చిల్లర తిరిగిచ్చినప్పుడు తెలిసింది వామనరావ్‌కి ఖరీదైన సిగరెట్టే ఇచ్చాడని.

అదే సిగరెట్టో చూసుకుని "ఏంటోయ్ మరీ ఇంత ఖరీదైన సిగరెట్ ఇచ్చావ్?" అని అడగకుండా ఉండలేకపోయాడు.

"మీరేదైనా ఫర్లేదన్నారు కద సార్?" అన్నాడతను ఓ నవ్వు నవ్వి.

"భలే ఉందోయ్ నీ తెలివీ! నీ లాభం జూసుకున్నావన్నమాట!" అంటూ ఆ కుర్రాడ్ని గుర్రుగా చూశాడు వామనరావ్.

అతను 'కార్లో వచ్చాడు. కాస్త్లీ సిగరెట్ ఇస్తే గింజుకుంటాడేంటి? కారు సొంతది కాదేమో. అరువు తీసుకుని పోజుగా షికార్లకి బయలుదేరాడేమో బేవార్స్ వెధవ' అనుకున్నాడని వామనరావ్‌కి తెలీదు.

తెలిస్తే?

★

